**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేదీ.17.11.2024** **సమయం. 07.05 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. **నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అబుజాలో చర్చలు జరుపుతారు.**

2. **కాంగ్రెస్ ఓట్ల కోసం సామాజిక వ్యవస్థను దెబ్బతీయడానికి ఎంతకైనా తెగిస్తుందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆరోపించారు.**

3. **భారత్ తన సాంఘిక సంక్షేమ కార్యక్రమం కింద సురినామ్‌కు సుమారు 425 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువుల మొదటి విడత సరుకులను పంపింది.**

4. **ఈరోజు బీహార్‌లోని రాజ్‌గిర్ హాకీ స్టేడియంలో మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2024లో తమ చివరి గ్రూప్-స్టేజ్ మ్యాచ్‌లో భారత్, జపాన్‌తో తలపడుతుంది.**

**PM NIGERIA VISIT**

**నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అబుజాలో చర్చలు జరుపుతారు. నైజీరియాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం నరేంద్రమోదీ నిన్న రాత్రి అబుజా చేరుకున్నారు. గత 17 ఏళ్లలో భారత ప్రధానమంత్రి నైజీరియాలో పర్యటించడం ఇదే**

తొలిసారి. మోదీ తమ రెండు రోజుల పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, ద్వైపాక్షిక సంబంధాల పెంపు తదితర అంశాలపై ఆ దేశ అగ్ర నాయకత్వంతో చర్చలు జరుపుతారు. అక్కడి ప్రవాస భారతీయులతో నరేంద్రమోదీ ఇష్టాగోష్టి సమావేశం జరుపుతారు. 2007 నుండి పెరుగుతున్న ఆర్థిక, ఇంధన, రక్షణ సహకారంలో భారత్, నైజీరియా దేశాలు వ్యూహాత్మక భాగస్వాములుగా ఉన్నాయి. నైజీరియాలోని ముఖ్యమైన రంగాలలో 200 కంటే ఎక్కువ భారతీయ కంపెనీలు 27 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. రెండు దేశాలు పటిష్టమైన అభివృద్ధి సహకార భాగస్వామ్యాన్ని కూడా కలిగి వున్నాయి. కాగా, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ డా సిల్వా నిర్వహించే జి-20 సదస్సులో పాల్గొనేందుకు నరేంద్రమోదీ రేపు బ్రెజిల్ లోని రియో డి జెనీరో నగరానికి వెళ్తారు. మూడవ దశలో ప్రధానమంత్రి ఈనెల 19 నుండి 21 వరకు గయానాలో పర్యటిస్తారు.

## RAJNATH SINGH-CAMPAIGN

కాంగ్రెస్ రాజకీయాల్లో అవిశ్వాసాన్ని పెంచుకుందని, ఓట్ల కోసం సామాజిక వ్యవస్థను దెబ్బతీయడానికి ఎంతకైనా తెగిస్తుందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆరోపించారు. కాంగ్రెస్ దేశాన్ని 50 ఏళ్లు పాలించిందని, కానీ భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఏనాడూ గౌరవించలేదని అన్నారు. నిన్న ముంబై, పాల్ఘర్, పుణెలో జరిగిన మూడు ఎన్నికల సభల్లో రాజ్ నాథ్ ప్రసంగించారు. కులగణనపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఉటంకిస్తూ, రాహుల్ గాంధీ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని, కులగణన పేరుతో ఓటర్లను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పాల్ఘర్‌లో బీజేపీ అభ్యర్థి తరుపున ప్రచారంలో పాల్గొంటూ... మహారాష్ట్ర, జార్ఖండ్‌లో బీజేపీకి ప్రజా మద్దతు లభిస్తోందని, ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదరిక నిర్మూలన నినాదం ఇచ్చిన ప్రతిసారీ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ 50 ఏళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ పేదరికాన్ని రూపుమాపలేదన్నారు. గతంలో జిల్లా పంచాయతీలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మాత్రమే మహిళలకు రిజర్వేషన్లు ఉండేవని, కేంద్రంలోని

మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో నారీ శక్తి వందన్ చట్టం బిల్లును ఆమోదించిందని, ఆ తర్వాత పార్లమెంటు, అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని అన్నారు.

## PM-SUMMIT

తమ ప్రభుత్వం ఓట్ బ్యాంకు రాజకీయాలకు దూరమని, ప్రజల కోసం ప్రజల ద్వారా ప్రగతి అనే సూత్రం ఆధారంగా పనిచేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ప్రస్తుత సామాజిమక మాధ్యమ కాలంలో తమ ప్రభుత్వం సరైన సమాచారం ప్రజలకు అందేలా అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిన నాయకత్వ సదస్సులో మాట్లాడుతూ నరేంద్ర మోడీ... మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం పట్ల ప్రజలు తమపై నమ్మకం ఉంచారని చెప్పారు. ఉగ్రవాదం విషయంలో కూడా కాలం మారిందని ఇప్పుడు ఉగ్రవాదులో అభద్రతా భావంతో ఉన్నారని మోడీ అన్నారు. 2014లో కేంద్ర బడ్జెట్ 16 లక్షల కోట్ల రూపాయలు కాగా ఈనాడు అది 48 లక్షల కోట్ల రూపాయలకు పెంచామని చెప్పారు. 2014లో 14 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 30 కోట్లు దాటిందని చెప్పారు. దీని వల్ల పారిశుద్ధ్యం పెరగడమే కాక ఆర్థిక వ్యవస్థ మెరుగై అనేక మందికి కొత్త ఉపాధి అవకాశాలు కలిగాయని ప్రధానమంత్రి తెలియజేశారు.

## PM EK PED MAA KE NAAM

ఏక్ పేడ్ మా కే నామ్ ను ప్రోత్సహించిన వారందరికీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలంతా తమ తల్లి గౌరవార్థం ఒక చెట్టును నాటాలని, పర్యావరణ సమతుల్యానికి సహకరించాలని సామాజిక మాధ్యమ పోస్ట్ లో నరేంద్రమోడీ కోరారు.

## INDIA-SURINAME

భారత్ తన సాంఘిక సంక్షేమ కార్యక్రమం కింద సురినామ్‌కు సుమారు 425 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువుల మొదటి విడత  సరుకులను పంపింది. మన దేశం సురినామ్‌తో సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉంది. భారత్, సురినామ్ తో ఒకటిన్నర శతాబ్దానికి పైగా సాంస్కృతిక, ప్రజా సంబాధాలను కలిగి వుంది. 1976లో భారత్, సురినామ్‌ల మధ్య దౌత్య సంబంధాలను ప్రారంభించినప్పటి నుండి అనేక ఉన్నత-స్థాయి సందర్శనలు, 1977లో పారామరిబో లో ప్రారంభించిన భారత రాయబార కార్యాలయం, 2000 సంవత్సరంలో న్యూఢిల్లీలో సురినామ్ దౌత్య కార్యాలయం ఏర్పాటు చేశారు.

## HOCKEY - WOMEN'S ASIAN TROPHY

ఈరోజు బీహార్‌లోని రాజ్‌గిర్ హాకీ స్టేడియంలో మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2024 లో తమ చివరి గ్రూప్-స్టేజ్ మ్యాచ్‌లో భారత్, జపాన్‌తో తలపడుతుంది. మ్యాచ్ సాయంత్రం 4 గంటల 45 నిమిషాలకు  ప్రారంభమవుతుంది. మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ అజేయంగా దూసుకెళ్లింది. ఆడిన అన్ని గేమ్‌లలో వారి నాల్గవ వరుస విజయాన్ని నమోదు చేసుకున్నారు, ఆతిథ్య జట్టు ఇప్పుడు నాలుగు గేమ్‌లలో 12 పాయింట్లతో మొదటి స్థానానికి చేరుకుంది. జపాన్ తమ మునుపటి మ్యాచ్‌లో మలేషియాను 2-1 తో ఓడించిన తర్వాత మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2024లో మొదటి విజయాన్ని నమోదు చేసింది.

## REV. EVE. JHARKHAND-CAMPAIGNING

జార్ఖండ్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీలైన ఎన్డీఏ కూటమి, ఇండియా కూటమి అభ్యర్థుల కోసం ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. హేమంత్ సోరన్ ప్రభుత్వం గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని సీనియర్ బిజెపి నేత కేంద్ర మంత్రి అమిత్ షా

ఆరోపించారు. డొంక, దేవగర్, గిరి ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా మాట్లాడుతూ... యూపీఏ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం ఎలాంటి నిధులను మంజూరు చేయలేదని తెలిపారు. జంతార ఎన్నికల ప్రచార సభలో సీనియర్ బిజెపి నేత, అసెంబ్లీ ఇంఛార్జ్ హేమంత విశ్వశర్మ మాట్లాడుతూ హేమంత్ సొరన్ ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేసిందని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఇది సరైన సమయం అని అన్నారు. రాజకీయ వేత్తగా మారిన చలన చిత్ర నటుడు మిథున్ చక్రవర్తి డుంకా, జంతార నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించారు. అలాగే పలువురు బిజెపి నేతలు శివరాజ్ సింగ్ చౌహాన్, చెంపై సోరెన్ పలు ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించారు.